## క్లుప్తంగా

### రావి ఆకుపై చాచా నెహ్రూ



పొదలకూరు : బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని నల్లపాళెం గ్రామానికి చెందిన మహిళ రావి ఆకుపై పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బొమ్మను గీశారు. చిత్రలేఖనంపై మక్కువతో ఉప్పు అమరావతి రావి ఆకుపై నెహ్రూ జన్మదినం సందర్భంగా ఆయన బొమ్మను గీశారు.

### విద్యార్థులకు బాణసంచా వితరణ



కోవూరు : కోవూరులోని సాంఘిక సంక్షేమ బీసీ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు స్థానిక వార్డు సభ్యుడు అత్తిపల్లి అనుప్‌రెడ్డి రూ.15 వేలు విలువ చేసే బాణసంచాను అందించారు. వీటిని ఎంపీడీఓ శ్రీహరితో పాటు ఆయన విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమాధికారులు వెంకట్రావు, జ్యోతిరాణి పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ధనలక్ష్మీకుబేరపూజ



విశేషాలంకారంలో స్వర్ణమహాలక్ష్మి అమ్మవారు

నెల్లూరు(బృందావనం): దీపావళి సందర్భంగా సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో ఆది, సోమవారాల్లో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.దీపావళి అమావాస్య సందర్భంగా సోమవారం ధనలక్ష్మీ కుబేరపూజ జరిపారు. దీపావళి అలంకారంలో స్వర్ణమహాలక్ష్మి అమ్మవారు భక్తులను కటాక్షించారు. మందిరం మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, సభ్యులు పర్యవేక్షించారు.

### వేదగిరిపై విశేష పూజలు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతినక్షత్రం సందర్భంగా ఆదివారం విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పావడసేవను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### 15,16న మెగా ఇంపాక్ట్

నెల్లూరు(మినీబైపాస్): మాస్టర్‌మైండ్స్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరంలో ఈ నెల 15,16 తేదీల్లో మెగా ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపల్ బీ చైతన్యకుమార్ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంపాక్ట్ కార్యక్రమంలో భాగంగా యువతకు మోటివేషన్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులను ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖులైన 20 మంది మోటివేటర్స్ హాజరుకానున్నారని చెప్పారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రూరల్ డీఎస్పీ ఆంజనేయరెడ్డి, ఇంపాక్ట్ ఫౌండర్ గంపా నాగేశ్వరరావు, మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతమ్, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఇంపాక్ట్ ఇన్‌చార్జి మల్లికార్జున్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డీ సునీల్, సైకాలజిస్ట్ సింగంశెట్టి అభిషేక్ పాల్గొన్నారు.

# శైవక్షేత్రాల్లో కార్తీక శోభ



కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం



ఆకాశ దీపంలో నూనె పోస్తున్న మహిళలు (ఫైల్)

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం

పొదలకూరు : వందల ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని శ్రీకామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం) దేవస్థానంలో కార్తీక మాస పూజలు నవంబర్ 14 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు నెలరోజుల పాటు జరుగుతాయి. మహిళా భక్తులు దేవస్థానం ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి భక్తిప్రపత్తులను చాటుకుంటారు. కార్తీక మాసంలో శివున్ని ఆరాధిస్తే కోరిన కోర్కెలు తీరడంతో పాటు మాంగళ్య బలం పెరుగుతుందని మహిళల నమ్మకం. ప్రతినిత్యం దేవస్థానంలో ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి సాయంత్రం 6.30 గంటలకు ఆకాశ దీపాన్ని కిందకు దింపుతారు. మహిళా భక్తులు రాత్రి 7.15 గంటల వరకు వెలుగుతున్న దీపంలో నూనెపోస్తారు. ముందుగా వెళ్లే మహిళలు దేవస్థానం ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తారు. ఇందువల్ల ఆయురారోగ్యాలతో పాటు, అష్ట ఐశ్వర్యాలు ప్రాప్తిస్తాయని అర్చకులు వెల్లడిస్తున్నారు. మహిళలకు ఎంతో ప్రీతిపాత్రమైన కార్తీక మాసాన్ని ఎలాంటి విఘ్నాలు లేకుండా నిర్వహించేందుకు గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు.

**కోటి సోమవారానికి విశిష్టత**

కార్తీక మాసంలో వచ్చే శ్రవణా నక్షత్రం రోజును కోటి సోమవారంగా పరిగణిస్తారు. ఇది సోమవారం రోజునే రావాలనే నియమమేమీ ఉండదు. వెంకటేశ్వరస్వామి జన్మదినమైన శ్రవణానక్షత్రం కార్తీక మాసంలో రావడం వల్ల కోటి సోమవారానికి విశిష్టత ఏర్పడింది.

### పవిత్రమైన మాసం



కార్తీక మాసానికి పురాణాల్లో సైతం ఎంతో పవిత్రత ఉంది. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

– ప్రసాద్‌స్వామి, రామలింగేశ్వర దేవస్థానం అర్చకుడు

### మల్లికార్జునస్వామి దేవస్థానంలో..



విద్యుద్దీపాల వెలుగులో ఆలయం

కోవూరు : కోవూరులోని గాంధీపార్క్ సెంటర్లో ఉన్న పార్వతి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. నేటి నుంచి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ చైర్మన్ బి.సురేష్ తెలిపారు.

**మైపాడులో పుణ్యస్నానాలు**

ఇందుకూరుపేట : మహా శివునికి ప్రియమైన కార్తీక మాసంలో ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు బీచ్‌లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. అనంతరం తీరంలో మహిళలు ఇసుకతో శివలింగం ఆకృతులను తయారు చేసుకుని పూజలు చేస్తారు. అలాగే తీరం వెంబడి ఉన్న జ్యోతిర్లింగాలయం, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. కాగా కార్తీక సోమవారం, కార్తీక పౌర్ణమి రోజుల్లో భక్తులు రాక అధికంగా ఉంటుంది.

### ముస్తాబైన సంగమేశ్వరాలయం



సంగమేశ్వరాలయం

మనుబోలు : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు ముస్తాబయ్యాయి. మనుబోలు మండల కేంద్రం పరిధిలో కండలేరు ఒడ్డున వెలసిన శ్రీకామాక్షితాయి సమేత సంగమేశ్వరాలయానికి ఇప్పటికే రంగులు వేసి ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు సర్వేపల్లి ఫణీంద్రశర్మ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకూ కార్తీక మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 11న కార్తీకమాస శివరాత్రి సందర్భంగా సంగమేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన, విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేషంగా తరలివచ్చి దేవదేవుని కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

## ఆటో బోల్తా

- ఒకరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడిని 108లో తరలిస్తున్న పోలీసులు

కొడవలూరు : ఆటో బోల్తా పడి ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని గండవరం సబ్‌స్టేషన్ వద్ద జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. బోగోలు నుంచి ప్రయాణికులతో నెల్లూరు వెళ్తున్న ఆటో ముందు వెళ్తున్న మరో ఆటోను తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బోగోలు మండలం బృందావనం వీధికి చెందిన తంబికన్నన్ సుందర్‌రాజన్(68)కు ఎడమ కాలు మడిమ వద్ద తెగిపోయింది. హైవే మొబైల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని 108లో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఏఎస్సై కబీర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యవసాయ విద్యార్థుల క్షేత్ర పర్యటన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రేబాల గ్రామంలో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకంలో భాగంగా సోమవారం క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. నూతన వ్యవసాయ పోకడల గురించి అవగాహన కల్పించారు. వరి తదితర పంటల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, కిరణ్‌కుమార్ రెడ్డి, రైతులు మస్తానయ్య, హరిప్రసాద్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీహెచ్ సతీష్‌రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాలతో దీపావళి



పొదలకూరురోడ్డులోని నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి క్రాకర్స్ వెలిగిస్తున్న మంత్రి కాకాణి



నగరంలో బాణసంచా కాలుస్తున్న చిన్నారి

నెల్లూరు(బృందావనం): దీపావళి పర్వదినాన్ని నగర ప్రజలు ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. సంప్రదాయంగా ఆలయాలు, గృహాల్లో లక్ష్మీదేవికి విశేషపూజలు నిర్వహించారు. ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా చీకటిని పారదోలుతూ దీపాలను వెలిగించారు. దీపకాంతులతో ఆలయాలు, గృహాలు దీపావళి శోభను సంతరించుకున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటిల్లిపాది పర్యావరణహిత టపాసులు పేల్చి సందడి చేశారు. పిండి వంటలను ఆరగించి ఆహ్లాదంగా గడిపారు.

## భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరస్వామివ్రతం



నెల్లూరు(బృందావనం): దీపావళి సందర్భంగా నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కేదారేశ్వరస్వామి వ్రతాన్ని ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు విశేషంగా హాజరై స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పర్యవేక్షించారు.

## సామాజిక సాధికార యాత్రకు తరలిరండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మనుబోలు : ఈనెల 16న సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరులో జరుగనున్న సామాజిక సాధికార యాత్రకు తరలి రావాలని వైఎస్సార్‌సీపీ నేత, మనుబోలు ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయం ఆవరణలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముత్తుకూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో 16వ తేదీ సాయంత్రం సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన సామాజిక సాధికార యజ్ఞానికి మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీందర్‌రెడ్డి, చల్లా నవకోటి, కోసూరు కోటేశ్వరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐ రామారావు హఠాన్మరణం



జి.రామారావు(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రామారావు(55) గుండెపోటుతో మరణించారు. వివరాలు.. ఆదివారం యథావిధిగా విధులకు హాజరైన సీఐ జి.రామారావుకు ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో సిబ్బంది హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందాడని తెలియజేశారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. మృతదేహాన్ని సీఐ స్వస్థలం గుంటూరులోని పున్నూరు దగ్గర మన్నావ గ్రామానికి తరలించారు.

**ఎమ్మెల్యే పరామర్శ**

సీఐ మృతి విషయం తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాస్పిటల్ వద్దకు వెళ్లి రామారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని తెలియజేశారు.

**బాధాకరం – డీసీఎమ్మెస్ చైర్మన్**

కొడవలూరు : బుచ్చిరెడ్డిపాళెం సీఐ జి.రామారావు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరితో స్నేహ పూర్వకంగా ఉంటూ వృత్తికే వన్నె తెచ్చిన ఆయన హఠాన్మరణం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కార్తీకమాస పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి దేవస్థానంలో ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ కార్తీకమాస పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాట్లాడుతూ కార్తీక మాసం నేపథ్యంలో స్వామి అమ్మవార్లకు నిర్వహించే వివరాలను పోస్టర్ల రూపంలో ఆవిష్కరించామన్నారు. మొదటి సోమవారం లక్ష దీపోత్సవం, రెండో సోమవారం అన్నాభిషేకం, మూడో సోమవారం రుద్రహోమం, నాలుగో సోమవారం పెన్నాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు.

### కంటి అద్దాల పంపిణీ

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న సెంబ్‌కార్ప్ పవర్ కంపెనీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన నేత్ర వైద్య శిబిరంలో ఆపరేషన్ చేయించుకున్న పేదలకు సోమవారం కంటి అద్దాలు అందజేశారు. ముసునూరువారిపాళెంలో సర్పంచ్ మునుకూరు జనార్ధనరెడ్డి ఆధ్వర్యంలో 87 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పవర్ కంపెనీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో భగవద్గీతపై ప్రచారం



మొగళ్లూరులో ప్రచారం చేస్తున్న కమిటీ బాధ్యులు

పొదలకూరు : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని మొగళ్లూరు, ఆల్తుర్తి, కనుపర్తి గ్రామాల్లో సోమవారం భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంట్లో దీపావళి జ్ఞాన జ్యోతి వెలిగించాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పొదలకూరు కమిటీ అధ్యక్షుడు పెంచలనర్సయ్య, సభ్యులు శేషాద్రి, పెంచలయ్య, కొండయ్య, కృష్ణయ్య, నర్సారెడ్డి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

### నేడు మంత్రి కాకాణి పొదలకూరుకు రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం 4 గంటలకు పొదలకూరు ఎంపీపీ కార్యాలయానికి విచ్చేసి హౌసింగ్‌కు సంబంధించి ఎస్టీలకు చెక్కులను పంపిణీ చేస్తారని ఏఈ శివమోహన్ సోమవారం తెలిపారు. తర్వాత ఎంపీపీ కార్యాలయంలో అధికారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుంటారన్నారు. ఈ సమావేశానికి లబ్ధిదారులను ఆయా గ్రామాల నాయకులు తీసుకు రావాల్సిందిగా కోరారు.

### నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కొడవలూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ కె.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల ప్రారంభ సందర్భంగా మంగళవారం ప్రదర్శన, జెండా వందనం, బాలల దినోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా బుధవారం పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన ఉంటుందన్నారు. గురువారం గ్రంథాలయ ఉద్యమం కోసం పాటు పడిన ప్రముఖుల గురించి చర్చా వేదిక, శుక్రవారం వకృత్వ పోటీలు ఉంటాయన్నారు. శనివారం క్విజ్, ఆటల పోటీలు, ఆదివారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, సోమవారం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం, ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

### నేడు అన్నారెడ్డిపాళెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

విడవలూరు : మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి సోమవారం తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొనాల్సిందిగా కోరారు.

### వ్యక్తి ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పెనుబల్లికి చెందిన షేక్ ఖాజావలి అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. జీవితంపై విరక్తి చెందిన ఖాజావలి (49) శనివారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### న్యాయం చేయాలని నిరసన

మనుబోలు : ప్రభుత్వం ఇచ్చిన భూమిని సాగు చేసుకునేందుకు వెళ్తే తమపై కొందరు దాడికి యత్నించి అసభ్య పదజాలంతో దూషించారని మండలంలోని కొమ్మలపూడికి చెందిన రైతు వెలిచర్ల ఆనందరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తనకు న్యాయం చేయాలని కోరుతూ కుల విమోచన పోరాట సమతి (కేవీపీఎస్) నాయకులతో కలిసి సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకుమూడి గ్రామ సర్వే నంబర్ 100లో తనకు 2 ఎకరాల 34 సెంట్ల భూమి ఉందన్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ రికార్డులు కూడా ఉన్నాయని తెలిపారు. అందులో సాగు నిమిత్తం దుక్కి దున్నేందుకు వెళ్లగా కొమ్మలపూడికి చెందిన కొందరు దౌర్జన్యం చేశారని వాపోయారు. తనను అసభ్యపదజాలంతో దూషిస్తూ పనులను అడ్డుకున్నారన్నారు. దాడి యత్నాన్ని అడ్డుకున్న కేవీపీఎస్ నాయకులను కూడా దూషించారని తెలిపారు. తమపై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నేతలు బీసీ భాస్కర్, దేవదానం, ఆదిశేషయ్య, సతీష్, సోమయ్య ఉన్నారు.